# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 26, ఫిబ్రవరి 2026



బాసర ట్రిపుల్ ఐటిలో కలకలం..

# హాస్టల్ గదిలో ఉరివేసుకుని విద్యార్థిని ఆత్మహత్య



**నిర్మల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థిని వసతి గృహంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం కలకలం రేపింది. బాసర సిఐ తెలిపిన వివరాల ప్రకారం బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఐఐఐటి)లో ఈసీఈ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని బుధవారం ఉదయం తన వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని హాస్టల్ కేర్ టేకర్ విజయ గమనించి వెంటనే ఉన్నతాధికారులు, బాసర పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించి ప్రాథమిక విచారణ చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, ప్రాథమిక సమాచారం మేరకు వ్యక్తిగత సమస్యల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోందని సీఐ తెలిపారు. నిర్మల్ ఎస్పీ, భైంసా ఏఎస్పీలు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.




# బ్యాంకర్లు రుణ లక్ష్యాలను సాధించాలి

☆ కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

నిర్దేశించిన రుణ లక్ష్యాలను బ్యాంకర్లు నిర్ణీత గడువులోగా సాధించి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో 2025-26 సంవత్సర మూడో త్రైమాసిక సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాధాన్యత రంగాలలో ఇవ్వవలసిన రుణాల లక్ష్యాలను పెంపొందించాలని, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేసి లక్ష్యసాధనకు కృషి చేయాలని తెలిపారు. ప్రధానమంత్రి ముద్ర రుణాలు, షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధికి కేటాయించిన రుణాలు, ప్రధానమంత్రి స్వయం ఉపాధి పథకం, ప్రధానమంత్రి విశ్వకర్మ వంటి ప్రభుత్వ పథకాలు, జన సురక్ష పథకాల లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 3023 కోట్ల రుణ లక్ష్యాలకు గాను ఇప్పటి వరకు జిల్లాలో 49 శాతంతో 1581 కోట్ల రుణాలు మంజూరు చేయడం జరిగిందని, లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో సాధించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీల అభివృద్ధి కొరకు మంజూరైన నిధులను బ్యాంకులు దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం 2026-27 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు రూపొందించిన పొటెన్షియల్ లింక్డ క్రెడిట్ ప్లాన్ పథకాన్ని అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం వీరభద్రుడు, ఆర్బిఐ ఎల్డిఓ రాములు, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రితేష్ గుప్తా, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా పరిశ్రమల శాఖ జిఎం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల సహకార సంస్థ ఈడి, బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బగూడెం బహిరంగ గని వద్ద ఉద్యోగాల కోసం

# భూ నిర్వాసితుల ధర్నా

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

బెల్లంపల్లి నియోజకవర్గం కాసిపేట మండలంలోని దుబ్బగూడెం బహిరంగ గని కోసం భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ స్థానికులు ధర్నా నిర్వహించారు. గని కోసం భూములు స్వాధీనం చేసుకున్నప్పటికీ, భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించారు. మండల నాయకులు, భూ నిర్వాసితులతో కలిసి గని వద్ద విధుల సమయంలో వాహనాల రాకపోకలను నిలిపివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రత్నం ప్రదీప్ మాట్లాడుతూ గని కోసం భూములు కోల్పోయిన స్థానిక ప్రజలకు ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన కార్మికులను తొలగించడం అన్యాయమని, భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా నేపథ్యంలో స్పందించిన యాజమాన్యం సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రౌతు సత్తయ్య, స్వప్న, డా రాజమోళి, మైదాం రమేష్, గుండా రాజు కుమార్, భూక్యా రవి, గోలేటి స్వామి, మహంకాళి, తోడేటి క్రిష్ణ, తోడేటి ప్రశాంత్, దాసరి సల్మాన్ రాజ్, చంద్రశేఖర్, వల్క చిలుకయ్య, సల్లూరి ప్రభాకర్, గుండా శ్రీనివాస్, కార్మికులు, భూ నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి

◆ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యాభ్యాసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో సులభంగా జీర్ణమయ్యే పౌష్టిక ఆహారాన్ని అందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కలముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి, మహాత్మ జ్యోతిబాపూలె అధికారి శ్రీధర్ లతో కలిసి సంక్షేమ శాఖల వసతి గృహ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సులభంగా జీర్ణమయ్యే పౌష్టిక ఆహారాన్ని సకాలంలో అందించాలని తెలిపారు. విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందుబాటులో ఉంచాలని, మిగతా 2లో..

# గుడుంబా స్థావరాలపై దాడులు

## 5000లీటర్ల గుడుంబా పానకం, ఇతర సామగ్రి ధ్వంసం



**వేమనపల్లి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

గుడుంబా నిర్మూలన ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా బుధవారం నీల్వాయి పోలీసుల ఆధ్వర్యంలో బుయ్యారం గ్రామంలో గుడుంబా స్థావరాలపై ప్రత్యేక దాడులు నిర్వహించారు. ఈ దాడులు చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, చెన్నూరు ఎక్సైజ్ సీఐ హరి, మంచిర్యాల టాస్క్ ఫోర్స్ సీఐ సమ్మయ్య, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ మిగతా 2లో..

# అక్రమ అరెస్టులతో ప్రతిపక్షం గొంతు నొక్కేయత్నం

- జైలులో బాల్క సుమన్‌ను పరామర్శించిన బిఆర్ఎస్ నేతలు
- ప్రత్యేక ప్రజా అభియోగాధికారి నియామకంపై ప్రశ్నల వర్షం కురిపించిన గెల్లు శ్రీనివాస్

– ఆదిలాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త



2లో..

## విద్యార్థులకు సులభంగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఆహారం తయారీ సమయంలో వంట చేసేవారు శుభ్రత నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నోడల్ అధికారులు, జిల్లా అధికారులు తమ పరిధిలోని వసతి గృహాలను సందర్శించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో ఏ జిల్లాలో లేనివిధంగా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, అన్ని గురుకుల పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులు బయటి ఆహారం తినకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పరీక్షల సమయం అయినందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బంది కొరత ఉన్నట్లయితే సంబంధిత మున్సిపాలిటీ కమిషనర్/మండల పరిషత్ అభివృద్ధి అధికారి సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించి ఉత్తమ ఫలితాల సాధన దిశగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు

(మొదటిపేజీ తరువాయి)

సంయుక్తంగా దాడులు నిర్వహించి 20 గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి దాడులు చేసి సుమారు 5000 లీటర్ల గుడుంబా పానకంతో పాటు కుండలు, ఇతర సామాగ్రిని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ గ్రామాలలో గుడుంబా తయారీ, విక్రయాలు చట్ట విరుద్ధమని అలాంటి కార్యక్రమాల్లో పాల్గొనవద్దని సూచించారు. గుడుంబా తయారీలో ఎవరైనా పాల్గొంటే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎక్సైజ్ ఎస్సై రమణ, బెల్లంపల్లి ఎక్సైజ్ ఎస్సై శారద పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## షీటీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త




కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్టీ హాస్టల్ పోస్టు మెట్రిక్ విద్యాలయంలో బుధవారం షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ షీ టీం ఇన్‌చార్జి ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ, విద్యార్థినులకు మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100 వినియోగం, సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు సాగాలని, ఎలాంటి వేధింపులు ఎదురైన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా సమస్యలకు గురైతే కాగజ్‌నగర్ షీ టీం నంబర్ 8712670565 కు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో హాస్టల్ ఇంచార్జి అధికారి శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు బి.రమాదేవి, శ్రీనివాస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో బురదగూడలో ఆరైవ్ అలైవ్ కార్యక్రమం

కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త



కాగజ్‌నగర్ మండలం బుర్దగూడ గ్రామంలో బుధవారం రూరల్ ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో ఆరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించడం ముఖ్యమని, ప్రమాదాలను తగ్గించడానికి వ్యక్తిగత బాధ్యతలలో భాగంగా ప్రతి వాహనదారుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం, వేగ పరిమితి, అతివేగం ప్రమాదాలపై ప్రచారం, మోటార్‌సైకిళ్లు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ,ద్విచక్ర వాహన సురక్షిత ప్రయాణానికి ట్రిప్ చెక్‌లు ప్రజలకు ఖచ్చితమైన రోడ్డు భద్రత చర్యలను పాటించేలా అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చని, ఇది కుటుంబాలను కాపాడడంలో కీలకమని ఎస్సై సందీప్ వివరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని గ్రామస్తులకు సూచించారు. అపరిచిత వ్యక్తులు గ్రామంలో వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:



భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలోని ధ్యానాపూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు రాజస్వ మండల అధికారి, భూ కొలతల శాఖ సహాయ సంచాలకులు విజయ్ కుమార్, తహసిల్దార్ రియాజ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం ప్రకారం నక్షా, గ్రామ హద్దులు లేని ధ్యానాపూర్ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గ్రామానికి స్పష్టమైన సరిహద్దులు లేని కారణంగా రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమన్వయం చేసి జిపిఆర్ఎస్ సాంకేతికత ద్వారా వ్యవసాయ భూములను సమగ్రంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. సర్వే ప్రక్రియ పూర్తి అయిన తర్వాత భూ వివాదాలు తగ్గి, రైతులకు భూములపై స్పష్టమైన హక్కులు లభించడంతో పాటు మేలు జరుగుతుందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఇతర గ్రామాలను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. సమగ్ర భూ సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు దీర్ఘకాలిక లాభాలు కలుగుతాయని, భూముల కొలతలు కచ్చితంగా నమోదు చేయడం వలన భవిష్యత్తులో రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని తెలిపారు. గ్రామ ప్రజలు అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకొనేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ప్రతిపక్షం గొంతు నొక్కేయత్నం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :

ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న బిఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు మోపుతూ ప్రజావారధిని మూయాలనే కుట్రకు పాల్పడుతోందని తెలంగాణ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గెల్లు శ్రీనివాస్ ఆరోపించారు. చట్టాలను చుట్టాలుగా మార్చుకుంటూ రాజ్యాంగ నియమ నిబంధనలను రేవంత్ సర్కార్ అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. బుధవారం బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు తుంగ బాలుతో కలిసి ఆదిలాబాద్ జిల్లా జైలుకు చేరుకొని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన గెల్లు శ్రీనివాస్ బాల్క సుమన్ అరెస్టు ప్రభుత్వ కుట్రలో భాగమని ప్రత్యేక ప్రజాభియోగాధికారి ( స్పెషల్ పీపీ )ని నియామించడం దానికి నిదర్శనమని విమర్శించారు. సుమన్ ఆరోగ్యం పై ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మెజారిటీ సీట్లతో గెలిచిన ప్రభుత్వం ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యతను విస్మరించి అక్రమాలకు పాల్పడుతోందని, ఆ విషయాన్ని ప్రశ్నించినందుకే సుమన్ పై కేసులు మోపడం దుర్మార్గమని అన్నారు. ఉద్యమ నాయకుడిగా తెలంగాణ సాధన కోసం పోరాడిన సుమన్ లోక్ సభలో రాష్ట్ర అభివృద్ధి జాతీయ అంశాలపై స్పష్టంగా స్వరం వినిపించిన వ్యక్తి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి పాలనను ప్రజల ముందుకు తీసుకువస్తూ బిఆర్ఎస్ పార్టీ ప్రజా వారధిగా నిలుస్తోందని, దానిని అడ్డుకునేందుకే అక్రమ అరెస్టులు చేస్తుందని ఆరోపించారు. మంత్రి వివేక్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసంపై జరిగిన వ్యవహారాన్ని సుమన్ ప్రశ్నించడంతో ప్రభుత్వ కుట్ర బయటపడిందన్నారు. టిఆర్ఎస్ నాయకులపై ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని అరెస్టులు చేసినా వెనుకడుగు వేయబోమని హెచ్చరించారు. రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వం నేనని ప్రజలు ధైర్యం కోల్పోవద్దని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బుట్టి శివకుమార్, నాయకులు దాసరి రమేష్, వాగ్మారే ప్రశాంత్, ధరణి రాజేష్, సాయి వంశీ, ఖలీం, సాధిర్, ప్రేమేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు

**- జగిత్యాల జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ చిత్రు పటేల్**

జన్నారం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త



విద్యార్థులు పక్కాగా ప్రణాళిక చేసుకుని పట్టుదలతో చదువుకుంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు అని జగిత్యాల జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ చిత్రు పటేల్ అన్నారు. బుధవారం నాడు మండల కేంద్రములోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సంధర్భంగా ఆయనకు పాఠశాల సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల జన్నారంలో చదివిన నేను ఈ పాఠశాలలో ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుకున్నానని ఆ రోజుల్లో తనకి బోధించిన ఉపాధ్యాయులను, అప్పటి పరిస్థితులను గుర్తుకు చేసుకుంటూ ఆ రోజుల్లో మాకు సరైన వసతులు లేనప్పటికీ మేము బాగా చదివి ఈరోజు ఒక జిల్లా అధికారిగా, ఒక కన్ఫామ్డ్ ఐఏఎస్‌గా ఎదిగాను. ఈ పాఠశాల శర్మన్ నాయక్ లాంటి ఐఏఎస్‌లను, జస్టిస్ చంద్రయ్య లాంటి జడ్జిలను ఎంతో మంది ఉన్నతాధికారు లను తయారు చేసింది కాబట్టి అలాంటి పాఠశాలలో చదువుతున్న మీరు ప్రభుత్వం కల్పిస్తున్న మంచి సౌకర్యాలను అందిపుచ్చుకొని ఉపాధ్యాయుల మంచి సలహాలతో జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని ఆ లక్ష్యం కోసం ఇష్టంతో కష్టపడి చదివి నా లాగే మీరు ఈ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. మనిషి క్రమశిక్షణ, కష్టపడే మనస్తత్వం, పట్టుదల ఉంటే మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శివరాజం మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థి జన్మించింది మారుమూల గ్రామమైనప్పటికీ మన జననం సాధారణమై నదే కావచ్చు కానీ మన మరణం చరిత్ర సృష్టించేదిగా ఉండాలి అన్న వివేకానంద స్వామి మాట ప్రకారం చిత్రు పటేల్ మారుమూల గ్రామమైన అలీ నగర్‌లో పుట్టి పెరిగి మన పాఠశాలలో చదువుకొని ఈరోజు ఈ స్థాయికి ఎదిగి తాను చదివిన పాఠశాలకే తాను ముఖ్యఅతిథిగా రావడం గర్వించదగ్గ విషయం అని అన్నారు.అదేవిధంగా మీరు కూడా బాగా చదివి మంచి ఉన్నతాధికారులుగా ఎదిగి భవిష్యత్తులో మీరు చదివిన ఈ పాఠశాలకు చిత్రు పటేల్ లాగానే ముఖ్యఅతిథిగా రావాలనే లక్ష్యాన్ని ఎంచుకోవాల్సిందిగా విద్యార్థులను ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఫిరాజి, భీర్షా, పీడీ గణేష్, శంకరయ్య, కిషన్ రావు, చందులాల్, పాఠశాల సంరక్షకులు రాజేష్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బిఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా

మంచిర్యాల, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త

జాతీయ, రాష్ట్ర భారతీయ మజ్దూర్ సంఘ్ బిఎంఎస్ ఆదేశాల మేరకు బుధవారం రోజు మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు చేసి కలెక్టర్ ఆఫీస్ ఏ.ఓ,రాజేశ్వర్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కార్మిక శాఖ కేంద్ర మంత్రికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారి దృష్టికి కూడా పంపించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కోరారు, అదేవిధంగా బి.ఎం.ఎస్.మంచిర్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కుంటాల శంకర్, మద్దూరి రాజు యాదవ్ మాట్లాడుతూ దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని, సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని,అన్ని రంగాల్లో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులకు ఇ.ఎస్.ఐ, ఇ.పి.ఎఫ్ వసతులు కల్పించాలని, ఇ.పి.ఎఫ్ ఇ.ఎస్.ఐ.కనీస వేతన పరిమితి పెంచాలి, ఇ.పి.ఎస్.95 ప్రకారం వెయ్యి రూపాయలు ఉన్న పెన్షన్ ఏడు వేల ఐదు వందల రూపాయలు పెంచాలని, బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలి, మిడ్ డే భోజన కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని,భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,15,16, 21, ప్రకారం స్కీం వర్కర్లను కామ బద్ధీకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు కుంటాల శంకర్, జిల్లా కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్, నాతాడి శ్రీధర్ రెడ్డి ఎస్.సి.ఎం.కె.ఎస్ వైస్ ప్రెసిడెంట్, లగిసెట్టి కమలాకర్ సింగరేణి పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి,పి.కిషన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్, బోడకుంట శ్రీధర్ ఎస్టి.పి.పి. ఆర్గనైజింగ్ సెక్రటరీ, భూంపల్లి రమేష్, రాజా రామ్ కిరణ్, జెల్ల తిరుపతి, చల్ల ప్రశాంత్,కాంపెల్లి తిరుపతి ఫిట్ సెక్రటరీ, తదితర కార్మికులు పాల్గొన్నారు.





## జాం గ్రామ పంచాయతీకి కంప్యూటర్ వితరణ

**సారంగాపూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

మండలంలోని జాం గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగంగా సర్పంచ్ కరిపే రవళి విలాస్ నూతన కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. గ్రామ పంచాయతీలో రికార్డుల నిర్వహణను ఆధునీకరించడానికి, ప్రజలకు ఆన్‌లైన్ సేవలను మరింత వేగంగా చేరవేయడానికి ఆమె తన సొంత ఖర్చుతో ఈ కంప్యూటర్‌ను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కంప్యూటర్ అందుబాటులోకి రావడం వల్ల గ్రామస్తుల వివరాలు, ప్రభుత్వ పథకాల డేటాను భద్రపరచడం సులభతరమవుతుందని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ చేతుల మీదుగా కంప్యూటర్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపసర్పంచ్ గంగాధర్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

**నిర్మల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల తొలిరోజు జిల్లాలో 95.70 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు కల్పించిన వసతులను పర్యవేక్షి ంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరాల నిఘా పనితీరును ఆమె స్వయంగా పరిశీలించారు. మొదటిరోజు పరీక్షకు మొత్తం 7,076 మంది విద్యార్థులకు గాను 6,772 మంది హాజరుకాగా, 304 మంది గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశురాం, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: ఎమ్మెల్యే

**నిర్మల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

సొన్ మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షాలు, వడగళ్ల వాన కారణంగా దెబ్బతిన్న మొక్కజొన్న పంటను బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి బుధవారం పరిశీలించారు. మండలంలోని సొన్, కూచన్ పల్లి, బొప్పారం, న్యూ వెల్మల్ గ్రామాల్లో నేలకొరిగిన పంటను చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క సొన్ మండలంలోనే సుమారు 1000 ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం నివేదికలకే పరిమితం కాకుండా, నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణమే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన నష్టాలకు కూడా ఇప్పటి వరకు పరిహారం అందలేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, సీనియర్ నాయకులు సరికెల గంగన్న, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, రైతులు పెద్ద



# ప్రమాదకరంగా మారిన కల్వర్టు

✦ ప్రమాదాల ముప్పులో ప్రజలు ✦ గుంతలతో నిండిన కల్వర్టు.. ✦ గాయాలపాలైన వృద్ధురాలు ✦ పట్టించుకోని అధికారులు

**మందమర్రి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల శాంతినగర్ గ్యారేజ్ లైన్ ప్రాంతంలోని కల్వర్టు ప్రమాదకర స్థితికి చేరుకుని స్థానిక ప్రజలు, వాహనదారులకు ప్రాణహాని కరంగా మారింది. కల్వర్టు పైభాగంలో పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో రాకపోకలు తీవ్రంగా అంతరాయం కలుగుతున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ గుంతలు స్పష్టంగా కనిపించకపోవడంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పలుమార్లు వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు నిరక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమని వారు ఆరోపిస్తున్నారు. బుధవారం ఉదయం ఒక వృద్ధురాలు కల్వర్టు పై నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా గుంతలో కాలు జారి కింద పడింది. అదృష్టవశాత్తూ ఆమెకు తీవ్ర గాయాలు కాలేదు. అయితే ఈ ఘటన స్థానికుల్లో తీవ్ర భయాందోళనలకు దారితీసింది. చిన్నపిల్లలు, వృద్ధులు, ద్విచక్రవాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించడం ప్రాణాలకు ముప్పుగా మారిందని ప్రజలు అంటున్నారు.ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. కల్వర్టు పరిస్థితి రోజురోజుకూ



కల్వర్టు వద్ద జరిగిన ప్రమాదంలో గాయాలపాలైన వృద్ధురాలు

మరింత దారుణంగా మారుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుకు తక్షణ మరమ్మతులు చేపట్టి ప్రజల భద్రతను కాపాడాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే ముందే శాశ్వత పరిష్కారం కల్పించాలని, లేకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న నిర్వాహకులు

## అవతార్ మెహర్ బాబా ఒక భారతీయ ఆధ్యాత్మిక గురువు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

అవతార్ మెహర్ బాబా ఒక భారతీయ ఆధ్యాత్మిక గురువని నిర్వాహకులు తాటిపల్లి రాజేశ్వర్, అశోక్ పేర్కొన్నారు. బుధవారం అవతార్ మెహర్ బాబా 132 జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని తమ నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన బోధనలు ప్రేమ, సత్యం, సేవ, ఆధ్యాత్మికతపై ఆధారపడి ఉన్నాయని, సేవ ద్వారా దేవత్వాన్ని సాధించవచ్చని బోధించారని తెలిపారు.మెహర్ బాబా 1969 జనవరి 31న మహారాష్ట్రలోని మెహర్‌బాద్‌లో మహాసమాధి పొందారని గుర్తుచేశారు. అనంతరం భక్తులు, ప్రజలకు మహాన్నదాత కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్, గిరీష్, ఆశిష్, హరీష్, అశోక్, సంతోష్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారికి అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం

## తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలి

**తాండూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**

పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలని తాండూర్ సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప రాణి అన్నారు. మండలంలోని రేచిని3 అంగన్వాడి కేంద్రంలో బుధవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారుల బరువు చూశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మొగిలి లక్ష్మణ్, అంగన్వాడి టీచర్ కుడిమేత వెంకటమ్మ, ఆశ వర్కర్ సునీత, తల్లులు పాల్గొన్నారు.

## మరమ్మతు పనులు వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:**

కోతకు గురైన సిసి రోడ్డు మరమ్మతు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం మాణిక్ గూడలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీని పరిశీలించారు.కుమ్రంభీమ్ ప్రాజెక్టు కుడి కెనాల్ తో కోతకు గురైన సిసి రోడ్డు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిసి రోడ్డు కోతకు గురైనందున సంబంధిత శాఖల సమన్వయంతో సకాలంలో పనులు పూర్తి చేసి సరి చేయాలని సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ త్వరలోనే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె.హరిత

## క్రీడల్లో గెలుపు ఓటములు సహజం

### - మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి

**తాండూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**



విన్నర్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమని తాండూర్ మాజీ ఎంపీపీ మాసాడి శ్రీదేవి అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో ఈనెల 12 నుంచి జరుగుతున్న మాసాడి విష్ణువర్ధన్ స్మారక క్రికెట్ పోటీలు బుధవారం ముగిసాయి. ఫైనల్ పోటీలలో బోయపల్లికి చెందిన క్రాంతి టీం విన్నర్ గా నిలిచింది. క్రికెట్ పోటీల ముగింపు, బహుమతుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరైనారు. ఆమె మాట్లాడుతూ క్రీడలు క్రీడాకారులలోమానసికొల్లాసానికి, శరీరధారుఢ్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. విన్నర్ జట్టుకు రూ.10వేలు నగదు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ. 8వేలు నగదు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మాసాడి శ్రీరాములు, మాసాడి తిరుపతి, ఉప సర్పంచ్ నల్లాల మహేష్, రఘు,నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్.ఎం.పి. సంఘం నిర్వహించిన

# ఉచిత కంటి శిబిరానికి భారీ స్పందన

**✪ 45 మందికి కంటి పరీక్షలు ✪ 20 మందికి ఉచిత శస్త్ర చికిత్సలు**

**మందమర్రి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలో ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ ఆర్.ఎం.పీ. సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పాల చెట్టు సమీపంలోని ఆర్.ఎం.పీ సంఘం కార్యాలయంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించారు. బి.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ కంటి వైద్యుడు డాక్టర్ బి.వి. రఘునందన్ పాల్గొని రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి పట్టణం, పరిసర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ కంటి సమస్యలను పరీక్షించుకున్నారు. ఈ శిబిరంలో మొత్తం 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 20 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. అవసరమైన రోగులకు డాక్టర్ రఘునందన్ ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ ఉచిత కంటి శిబిరాన్ని స్వాగతిస్తూ నిర్వాహకులను అభినందించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారికి ఇవి ఎంతో సహాయపడతాయని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని స్థానికులు కోరారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడమే కాకుండా, అవసరమైన వారికి సమయానికి చికిత్స అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరం ద్వారా అనేక మంది తమ కంటి సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స పొందే అవకాశం లభించిందని పేర్కొన్నారు.



శిబిరంలో కంటి వైద్య పరీక్షల నిర్వహణ



## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మేయర్, డిప్యూటీ మేయర్

**నస్పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లుగా ఎన్నికై, బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ధర్ని మధుకర్, సల్ల రమ్య బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ ఛాంబర్‌కు వెళ్లిన వారు, ఆయనకు మొక్కలను అందజేశారు.

## వీఓఏ మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

అంకత్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతాపూర్ కరుణామయ వీఓఏ మహిళా సంఘ భవన నిర్మాణానికి ఈ నెల 27న ఉదయం 9 గంటలకు భూమి పూజ నిర్వహించనున్నట్లు సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అంకత్‌పల్లి గ్రామ ప్రజలు, ఎస్‌హెచ్‌జీ సంఘ మహిళలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, పాత్రికేయులు అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగంపల్లి లతా వెంకటేష్‌తో పాటు ఉప సర్పంచ్ ఘనవేణి పోచ్ కుమార్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్ అనిత, కౌన్సిలర్లు

## 30 వార్డుల్లో మౌలిక వసతులు కల్పించాలి

**- మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ పట్టణంలోని 30 వార్డుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటుతో పాటు మంచినీటి ఇంటర్ కనెక్షన్లు కల్పించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనిత ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ డాక్టర్ అనిత గారు మాట్లాడుతూ పట్టణంలోని అనేక కాలనీల్లో సరైన వీధి దీపాలు లేవని దీంతో రాత్రివేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 30 వార్డుల్లో స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి, అవసరమైన చోట్ల కొత్త నీటి పైపులు వేసి ఇంటర్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు. వార్డులలోని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ తిరుపతి మాట్లాడుతూ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వలీ, వసీం అహ్మద్, నంది సాయి, మాణిక్య రావు తదితరులు పాల్గొన్నారు.

## వేలాడుతున్న త్రీఫేస్ వైర్లు... వంగిన స్తంభాలు

**ఫిర్యాదులు చేసిన స్పందన లేదని సర్పంచ్ ఆవేదన**

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**



*మండలంలోని పెంచికల్ పేట్ గ్రామంలో విద్యుత్ సమస్యలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో త్రీఫేస్ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా క్రిందకు వేలాడుతూ ఉండటం ప్రజల్లో ఆందోళనకు కారణమవుతుంది. కొన్నిచోట్ల విద్యుత్తు స్తంభాలు వంగిపోవడంతో ఎప్పుడు ఏదైనా ప్రమాదం సంభవిస్తుందోనన్న భయంతో గ్రామస్తులు గడుపుతున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉస్మాన్ మాట్లాడుతూ ఈ సమస్యలపై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతులు చేలు, పొలాలకు వెళ్లే రహదారుల్లో వైర్లు కిందకు వేలాడుతున్నాయని ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. సమయం సందర్భం లేకుండా ఎల్సీ పేరుతో గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని ప్రజలు తెలిపారు. గ్రామంలో వెంటనే విద్యుత్ స్తంభాలను సరిచేసి వేలాడుతున్న వైర్లను బిగించి, ప్రమాదం జరగకముందే అధికారులు తక్షణ చర్యలు తీసుకొని క్రమంబద్ధమైన సరఫరా అందించాలని ప్రజలు గ్రామస్తులు కోరుతున్నారు.*



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్ కుమార్ అన్నారు. మున్సిపల్ ఎలక్షన్ల ముందు మాట ఇచ్చినట్లు, ఎలక్షన్లు ముగిసిన పనులు మానేయలేదు. మున్సిపాలిటీ 14వ వార్డులో రోడ్డు పనులు పూర్తి చేపించిన ఘనత ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు దక్కుతుంది అని జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం గత ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సమస్యను నెరవేర్చింది అని కాలనీ వాసులు అందరూ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పుడు మా కాలనీలో ప్రయాణం సులభం అని తెలిపారు. ఈ రోడ్డు కోసం అనునిత్యం వెంటపడి సాధించిన మాజీ కౌన్సిలర్‌లు చింత సువర్ణ అశోక్ కుమార్, రాందేని సత్తవ్వలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు సుగుణాకర్, ఇమాన్ తదితరులు పాల్గొన్నారు.

## మొదటి రోజు ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు

**జన్నారం, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

జన్నారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, కరిమల జూనియర్ కళాశాలలో కలిపి మొదటి రోజు జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలకు పదకొండు మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 156 మంది విద్యార్థులకు గాను 150 మంది విద్యార్థులు హాజరయ్యారని, కరిమల జూనియర్ కళాశాలలో 124 మంది విద్యార్థులకు గాను 119 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.



## విద్యార్థినిల సౌకర్యార్థం మరుగుదొడ్డి నిర్మాణం

**- భూమిపూజ చేసి పనులను ప్రారంభించిన సర్పంచ్**

**కాగజ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామ పంచాయతీ పరిధిలోని యుపిఎస్ ఉర్దూ స్కూల్లో ప్రత్యేకంగా విద్యార్థినుల సౌకర్యార్థం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మరుగుదొడ్డి నిర్మాణానికి కోయవారు సర్పంచ్ చింతపురి లక్ష్మి భూమిపూజ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్యంగా, సురక్షితంగా చదువుకోవడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ మణిరాజ్, కోయవాగు ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డ్ మెంబర్ పులజాలే అను,ఆదే సునిత, చింతలపురి మల్లేష్, మారుతి, అదే శ్రీనివాస్,గ్రామస్తులు,పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అల్లుకున్న నిర్లక్ష్యం..



## ✶ విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన చెట్లు... ✶ స్పందించని అధికారులు ✶ వెలగని వీధి దీపం ✶ చెత్తతో నిండిన కాలువలు

**మందమర్రి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణం దీపక్ నగర్ 16వ వార్డ్లో ప్రజలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీపక్ నగర్లో వార్డ్ బోర్డు సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభంపై చెట్లు పూర్తిగా పెరిగి వీధి దీపాన్ని కప్పివేయడంతో రాత్రి వేళల్లో దీపం వెలగక ప్రాంతం అంధకారంలో మునిగిపోతోంది. దీని వల్ల కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యుత్ స్తంభం చుట్టూ చెట్లు విపరీతంగా పెరిగి విద్యుత్ తీగలకు ఆనుకునే పరిస్థితి ఏర్పడింది. ఇది ఎప్పుడైనా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా ఇతర ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో వెలుతురు లేకపోవడం వల్ల దొంగతనాలు, ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా పెరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. కాలనీలోని కాలువల చుట్టూ చెత్త పేరుకుపోవడం, చెట్లు మొలకెత్తడం వల్ల పారిశుధ్య పరిస్థితి దారుణంగా మారింది. వీధిలో దోమలు, పురుగులు పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడం వలన సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. ఈ సమస్యలను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల భద్రత, పారిశుధ్యంపై బాధ్యత వహించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

### తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్

ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ స్తంభం చుట్టూ పెరిగిన చెట్లను తొలగించి వీధి దీపం సక్రమంగా వెలిగేలా చర్యలు చేపట్టాలని, కాలువల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందని పేర్కొన్నారు.

# మంచిర్యాల పురోగతే లక్ష్యం: మేయర్ ధర్ని మధుకర్

## పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి.. నేడు నగరంలో స్పెషల్ డ్రైవ్

**నస్పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

మంచిర్యాల నగర పాలక సంస్థ అభివృద్ధే మన ప్రధాన ధ్యేయమని మేయర్ ధర్ని మధుకర్ పేర్కొన్నారు. మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని 10, 30, 32వ డివిజన్లలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, రహదారుల నిర్మాణ ప్రగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ అన్వేష్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగర సుందరీకరణ, ప్రజల సౌకర్యార్థం చేపట్టే పనుల్లో నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా డివిజన్ల వారీగా పారిశుద్ధ్య పరిస్థితులను మేయర్ సమీక్షించారు. డ్రైనేజీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గురువారం నగరం అంతటా ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించి మురుగు కాల్వలను శుభ్రం చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రహదారుల నిర్మాణ పనుల వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పాలక వర్గం పనిచేస్తుందని వెల్లడించారు. ప్రజల నుంచి అందిన వినతులపై సానుకూలంగా స్పందించిన మేయర్, క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ రాచకొండ గోపాల్ రావు, 30వ డివిజన్ కార్పొరేటర్ కర్రె శ్రీనివాస్, నగర పాలక సిబ్బంది, ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న మేయర్ ధర్ని మధుకర్, అధికారులు

# ఇంటర్ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతం

**మందమర్రి, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**



పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు

మందమర్రి మండలంలో ఇంటర్మీడియట్ పరీక్షలు తొలి రోజు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిశాయి. ఎక్కడా మాల్ప్రాక్టీస్కు సంబంధించిన కేసులు నమోదు కాకుండా పరీక్షలు సజావుగా కొనసాగాయి. మండలంలోని వివిధ పరీక్షా కేంద్రాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరై ప్రశాంతంగా పరీక్షలు రాశారు. అధికారుల సమాచారం మేరకు మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభమైన నేపథ్యంలో, రేపటి నుంచి రెండవ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అంతరాయం లేకుండా పరీక్షలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకునేలా సూచనలు ఇచ్చారు. ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, నిర్ణీత సమయం తరువాత ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు మాత్రమే పరీక్షకు అనుమతి కల్పించినట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావడాన్ని కఠినంగా నిషేధించారు. ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు, విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షకులు, సిబ్బంది సమన్వయంతో పరీక్షలను విజయవంతంగా నిర్వహించారు.

# 10వ తరగతి వార్షిక పరీక్షల కార్యాచరణ ఖరారు

## - మంచిర్యాల జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య

**నస్పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

10వ తరగతి వార్షిక పరీక్షల కార్యాచరణ ఖరారు అయిందని జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోసిట్ 1, 2 పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 11 గంటల వరకు, ఎస్.ఎస్.సి. ఒకేషనల్ కోర్సు (థియరీ) పరీక్ష ఉదయం 9:30 గంటల నుండి 11:30 గంటల వరకు, మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.




# రాంప్ ద్వారా మహిళలకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణ మద్దతు

## - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య

**నస్పూర్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

రాంప్ మహిళా త్వరణ కార్యక్రమం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎం.ఎస్.ఎం.ఈ.లకు నిర్మాణాత్మక వ్యాపార త్వరణం మద్దతును అందించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి అంజయ్య లతో కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళ వ్యవస్థాపకులకు ఐటిఈసి విభాగం, వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు, భారత ఎంఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ మద్దతుతో రాంప్ ద్వారా మహిళల నేతృత్వంలోని సంస్థలు, ఎంఎస్ఎమ్ఈ నిర్మాణాత్మక వ్యాపార రంగాలలో మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. 2 సంవత్సరాల ఈ కార్యక్రమం ఎంపిక చేసిన మహిళా వ్యవస్థాపకులకు వ్యాపార వృద్ధిని వేగవంతం చేసేందుకు, వారి ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం అందిస్తుందని తెలిపారు.

# వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టి.జి.టి.డబ్ల్యూ.ఆర్.జె.సి బాలికల, బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని, ప్రశ్నాపత్రాల భద్రత, సిసి కెమెరాల పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ తదితర అంశాలను పర్యవేక్షించాలని తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని, నిబంధనలు పాటించాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు తీసుకురాకుండా చూడాలని, సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

